# గరీబోనికి సన్నన్నం

## రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీకి నిర్ణయం

- మ్యానిఫెస్టోలో విప్లవాత్మక హామీ ఇచ్చిన బీఆర్ఎస్
- అక్రమ దందా, రీ సైక్లింగ్‌కు చెక్
- ఉమ్మడి జిల్లాలో 7.46 లక్షల కుటుంబాలకు ప్రయోజనం
- సర్కారు నిర్ణయంపై సర్వత్రా హర్షం

మంచిర్యాల, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ విప్లవాత్మక హామీ ఇచ్చింది. తెల్ల రేషన్‌కార్డులున్న కుటుంబాలన్నింటికీ సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పిల్లలకు సన్నన్నం పెడుతున్న సర్కారు, ఈ ఎన్నికల్లో గెలిస్తే రేషన్ లబ్ధిదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొంది. అనేక మంది రేషన్ బియ్యాన్ని తినలేక ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇలా రేషన్ బియ్యం కొనడం, దాన్ని గుట్టుచప్పుడు కాకుండా మహారాష్ట్రకు తీసుకెళ్లి విక్రయించడం పెద్ద దందాగా మారింది. బీఆర్ఎస్ తీసుకున్న నిర్ణయంతో అక్రమ దందాకు చెక్ పడనున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే పేదల ఆకలి తీరడంతో పాటు రేషన్ బియ్యం రీసైక్లింగ్ కూడా పూర్తిగా బంద్ కానున్నది. రాష్ట్రంలో 93 లక్షల కుటుంబాలుండగా, దాదాపు 3 కోట్ల మందికి ప్రయోజనం చేకూరనున్నది. తద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై రూ.1500 కోట్ల అదనపు భారం పడనున్నది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తెల్లరేషన్ కార్డులున్న 7.46 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నది. సీఎం కేసీఆర్ మానవీయ కోణంలో తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది.



### సన్నబియ్యం సంతోషమే..



నాతో పాటు కొడుకు, కోడలు, మనవ డు ఉంటరు. నా భర్త కొన్నేండ్ల కింద చనిపోయిండు. మా రేషన్ కార్డుమీద నెలకు 18 కిలోల ఉచిత బియ్యం ఇస్తున్నరు. ఈ బియ్యమే నెలమొత్తం సరిపోతున్నయ్. సీఎం కేసీఆర్ సారు ఈ కార్డు ఉన్నోళ్లందరికీ సన్నబియ్యమే ఇస్తమని మాట ఇచ్చిండ్రు. ఇది మాకే కాదు మా గ్రామంల అందరికీ సంతోషంగా ఉంది. గీ కాలంల అందరూ సన్నబియ్యానికి అలవాటు వడ్డరు. ఎంత కంట్రోలు బియ్యం ఉన్నా సుట్టా లు అస్తే పోతే పనికస్తదని, పిలగాండ్లు తింటరని అందరి ఇండ్లళ్ల గొంచెమన్నా సన్నబియ్యం కొనుక్కుంటున్నరు. ఇపుడు సీఎం సారు మంచిగ ఆలోచనజేసి అది కట్టడి చేస్తున్నరు. ఇగ కంట్రోలు బియ్యం అమ్మేటోళ్లే ఉండరు. మా అసోంటి పేదోళ్లకు ఇగ కార్డుమీద నెలనెలా సన్నబియ్యం అస్తయి, దుకాండ్ల కిలకు రూ. 50-60 పెట్టి కొనేటి పని ఉండదు. ఇదిగాక సీఎం సారు నాలుగు వందలకే గ్యాస్ సిలిండరు ఇస్తమన్నరు. నాకు పింఛన్ కూడా వస్తున్నది. సీఎం కేసీఆర్ పేదోళ్లకు మంచిజేస్తడు.

**-చెరుపుల పార్వతీబాయి, లబ్ధిదారు, కరంజి(టి)**

### అందరికీ ఒకేరకం బియ్యం



దస్తురాబాద్,అక్టోబర్ 20 : అన్నపూర్ణ పథకం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ఒకే రకం బియ్యం పంపిణీ చేస్తామనడం చాలా సంతోషంగా ఉంది. తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో సీఎం కేసీఆర్ ప్రకటించడం గొప్ప విషయం. మూడు పూటలా కడుపు నిండా పేదవాళ్లు తినాలనే లక్ష్యంతో తెచ్చిన సన్నబియ్యం పంపిణీ పథకం ఎంతో భరోసాను ఇస్తున్నది. ఇక సన్నబియ్యందుకాణాల్లో కొనే పరిస్థితి ఉండదు. గిప్పుడు సన్నబియ్యానికి క్వింటాల్‌కు రూ. 6 వేలకు పైగా ధర ఉంది. ఈ పథకం ప్రతి పేద కుటుంబానికి ఆర్థికంగా భరోసానిస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు సన్నబియ్యంతో అన్నం పెడుతున్నది. ఇక ప్రతి పేదోడికి సన్నబియ్యంతో కడుపు నింపబోతున్నది.

**-దాసరి సుధాకర్, చెన్నూర్**

### కొనుక్కునే ఇబ్బంది తప్పింది..



కుంటాల, అక్టోబర్ 20: రేషన్ షాపులో ప్రతి నెలా దొడ్డుబియ్యం తీసుకుంటున్నం. ఇప్పుడు కేసీఆర్ సారు వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే సన్నబియ్యం ఇస్తనని ప్రకటించిండు. చాలా సంతోషంగా ఉంది. దుకాణాల్లో సన్నబియ్యం కొనుక్కునే ఇబ్బంది తప్పుతది. ఇప్పుడు బియ్యం రేటు కూడా మస్తుగున్నది. పేదోళ్లు కొనే పరిస్థితే లేకుండా పోతున్నది. నాకు ఇటీవలే దవాఖానలో ఆపరేషన్ అయితే, సీఎంఆర్ఎఫ్ కింద ప్రభుత్వం ఆదుకున్నది. పేదోళ్లకు మంచి చేసేందుకే కేసీఆర్ సారు చూస్తున్నడు. గిప్పుడు కడుపు నిండా బువ్వ తినాల్నని సన్నబియ్యం ఇస్త అంటున్నడు.

**-అగల్దుతి లక్ష్మి, కుంటాల**

### సన్న బియ్యంతో ఇగ భోజనం



ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 20: బీఆర్ఎస్ గెలిస్తే పేదలకు సన్న బియ్యం ఇస్తమని సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చడం హర్షణీయం. ఇప్పటికే స్కూళ్లు, కాలేజీల్లో చదువుకునే పిల్లలకు సన్నబియ్యంతో అన్నం పెడుతున్నరు. ప్రజలందరి సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ అనేక సంక్షమ పథకాలు ప్రవేశపెట్టిన్రు. కూలీనాలి చేసుకునే వారు సన్నబియ్యం తినాలంటే ఆర్థికంగా ఎంతో ఇబ్బంది ఉంటది. సన్నబియ్యం పంపిణీ చేస్తమని సీఎం చేసిన ప్రక టన ప్రతి ఒక్కరికీ సంతోషాన్నిస్తున్నది. మూడోసారి అయనే సీఎం కావడం పక్కా. పేదోళ్ల గుండెల్లో సీఎం కేసీఆర్ ఉంటడు.

**- చుక్కల కిషన్, ఖానాపూర్**

### మాట ఇస్తే తప్పడు



వాంకిడి, అక్టోబర్ 20 : మన సీఎం కేసీఆర్ అడుగకున్నా అన్నీ చేస్తున్నడు. ఇప్పటికే పేదోళ్ల కోసం ఎన్నో పథకాలు తీసుకొచ్చిండు. మళ్లా బీఆర్ఎస్ గెలిస్తే రేషన్‌కార్డు ఉన్నోళ్లందరికీ సన్న బియ్యం ఇస్తమని చెప్పిండు. ఆయన ఒక్కసారి మాట ఇస్తే.. అయి తీరుతది. ఏ పార్టీ వాళ్లు వచ్చినా పట్టించు కోం. మళ్లా కారు గుర్తుకే ఓటేస్తం. కేసీఆర్‌నే గెలిపించుకుంటం. గాయన ఉంటేనే మా పేదోళ్లకు మేలు జరుగుతది.

**- సోయం రాధాబాయి, బంబార**

### గొప్ప సాహసం చేసిన కేసీఆర్



కుభీర్, అక్టోబర్ 20: పేద ప్రజలకు రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం అందిస్తామని సీఎం కేసీఆర్ చెప్ప డం హర్షణీయం. పేదోళ్లు కూడా సన్న బియ్యంతో భోజనం చేస్తరు. సీఎం కేసీఆర్ చెప్పిండంటే కచ్చితంగా చేస్తడు. చెప్పని పనులే ఎన్నో చేసిండు. మాకు చాలా ఆనందంగా ఉంది. పేదింటి బిడ్డలు కూడా సన్నబియ్యంతో అన్నం తినాల్నని ఆయన తలచిండు. రేషన్ దుకాణాల్లో ఇస్తున్న దొడ్డు బియ్యానికి బదులు సన్నబియ్యం ఇస్తే మంచిదే.

**-దన్గరి లాలేశ్, రైతు, సాంగ్వి గ్రామం**

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-320501-All

PLOT FOR SALE



★హైదరాబాద్, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ, జనచైతన్య, బాటసింగారం శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును/ అమ్మబడును, నో Brokers.
Ph: 9666912111, 7995005999.
NT-318030

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆదిలాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

### పేద విద్యార్థులకు మంచి అవకాశం



ప్రభుత్వం ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలల్లో పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందుతున్నది. వీటిల్లో రెసిడెన్షియల్ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేస్తూ వారి ఉన్నత చదువులకు బాటలు వేస్తున్నది. పేద విద్యార్థులు బాగు చదవి, పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపుతున్నారు. ఇప్పుడు అగ్రవర్ణాల్లో పేదింటి పిల్లలకు కూడా సీఎం కేసీఆర్ గుడ్ న్యూస్ చెప్పిన్రు. రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తామని బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించడం సంతోషకరం. సర్కారు అందిస్తున్న సాయంతో పేద విద్యార్థులు బాగా చదివి, ఉన్నతమైన ఉద్యోగాలు చేసే అవకాశం ఉంది. తల్లిదండ్రులకు కూడా పిల్లల చదువుల ఖర్చులు తగ్గుతాయి.

**- కృష్ణారెడ్డి, ఇచ్చోడ**

### మ్యానిఫెస్టో అద్భుతంగా ఉంది



తాంసి, అక్టోబర్ 20: కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో చాలా అద్భుతంగా ఉంది. ఏ పార్టీలు అమలు చేయని పథకాలు ఆయన అమలు చేస్తున్నారు. ఈ తొమ్మిదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, దేశానికి ఆదర్శంగా నిలిపారు. ఇప్పుడు ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో అగ్రవర్ణాల పేదల కోసం రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రకటించడం అభినందనీయం. సీఎం కేసీఆర్ కచ్చితంగా చేస్తారనే నమ్మకం ఉంది. అగ్రవర్ణాల్లో కూడా పేదలు ఉంటరు. వారిని కూడా ఆయన గుర్తించి, ప్రత్యేకంగా పిల్లల కోసం పాఠశాలలు ఏర్పాటు చేస్తామనడం సంతోషంగా ఉంది.

**- సురేశ్ రెడ్డి, బండల్ నాగపూర్, మండలం తాంసి**

# అగ్రవర్ణ పేదలకూ గురుకులాలు

## నియోజకవర్గానికి ఒక రెసిడెన్షియల్ పాఠశాల

- మ్యానిఫెస్టోలో పొందుపరిచిన బీఆర్ఎస్
- మళ్లీ అధికారంలోకి రాగానే ఏర్పాటు చేస్తామని హామీ
- సర్వత్రా హర్షం

ఆదిలాబాద్, అక్టోబర్ 20 ( నమస్తే తెలంగాణ): ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆదిలాబాద్ జిల్లాలో విద్యారంగం అస్తవ్యస్తంగా ఉండేది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సరైన వసతుల లేక విద్యార్థుల చదువులు ముందుకు సాగేవి కావు. పేద విద్యార్థులకు చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా గత ప్రభుత్వాల ప్రోత్సాహం కరువైంది. దీంతో ప్రతిభగల విద్యార్థులు మధ్యలోనే చదువులు ఆపేయాల్సిన పరిస్థితి ఉండేది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించేందుకు ప్రణాళికతో ముందుకెళ్లింది. అన్ని వర్గాలకు చెందిన పిల్లలు ఉచితంగా విద్యను అభ్యసించేలా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసింది. ఇందులో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించింది. ఇక ఈ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఇంటర్ విద్యను కూడా ప్రవేశపెట్టింది. జిల్లాలో ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలల్లో వేలాది మంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారు. సర్కారు అందిస్తున్న సాయంతో వారు బాగా చదువుకొని తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నారు. ఐఐటీ, జేఈఈ, నీట్, ఎంసెట్ లాంటి పరీక్షల్లో ప్రతిభ చూపుతున్నారు.

### అగ్రవర్ణాల్లోని పేదింటి పిల్లలకూ..

అగ్రవర్ణాల్లోని పేదలకు కూడా గురుకులాలు ఏర్పాటు చేయనున్నట్లు బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. అగ్రవర్ణాల్లోని పేదలు తమ పిల్లలను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నారు. ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు ఎక్కువగా ఉండడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఇక నుంచి వీరికి ఈ సమస్య లేకుండా బీఆర్ఎస్ అండగా నిలవబోతున్నది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నియోజకవర్గాలకు ఒక రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రారంభించే అవకాశాలున్నాయి. గురుకులాల్లో కార్పొరేట్ విద్య, పౌష్టికాహారం, ఇతర సౌకర్యాలు ఉండడంతో విద్యార్థులు బాగా చదువుకొని వారి బంగారు భవిష్యత్‌ను తీర్చుదిద్దుకోనున్నారు. అగ్రవర్ణాల్లోని పేదలకు రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభిస్తామని హామీనివ్వడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.